క్లుప్తంగా

కనకదుర్గ అమ్మవారికి చండీ హోమం



కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ౦చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి జన్మనక్షత్రం 'మూల' సందర్భంగా ఆదివారం అమ్మవారికి చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు గొల్లపల్లి గణపతి, చిట్టి శివ, చిట్టెం గోపి, చెల్లపిల్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. ఐదుగురు భక్తులు రూ.750 టిక్కెట్‌తో హోమంలో పాల్గొన్నారు.

అన్నసమారాధన

కిర్లంపూడి: స్థానిక బాలరాజునగర్‌లో వేంచేసిన బాలరాజులబాబు చెట్టు (ఆలయం) వద్ద ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు సరిసే రాంబాబు, కంచి నాగేశ్వరరావు, కరెడ్ల వీరబాబు, పెనగంటి నారాయణరావు, దొడ్డి రామారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా



ఏలేశ్వరంలో ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఏలేశ్వరం: కండక్టర్‌ను అక్రమంగా సస్పెండ్ చేయడానికి నిరసనగా పట్టణంలో ఆర్టీసీ ఉద్యోగులు చేస్తున్న ధర్నా రెండో రోజు ఆదివారం కొనసాగింది. ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో డిపో గేట్ వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ ఎస్వీ రమణను 1/2009 సర్క్యులర్‌కు విరుద్ధంగా సస్పెండ్ చేశారన్నారు. రమణను విధుల్లోకి తీసుకునే వరకూ ఉద్యమం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎంయూ డిపో కార్యదర్శి టి.త్రిమూర్తులు, ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి యూబీఎం కుమార్, యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎస్‌పీరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

తునిలో ఉద్యోగుల నిరసన



తునిలో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

తుని: 1/2019 సర్క్యులర్‌ను తక్షణమే అమలు చేయాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు డిమాండు చేశారు. ఈ మేరకు నేషనల్ మజ్దూర్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్టీసీ డిపో ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్క్యులర్ అమలు చేసే వరకూ ఉద్యోగుల పోరాటం కొనసాగుతుందన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఎ.ప్రకాష్, కేవీఎస్‌పీ రావు, చందు, రహ్మతుల్లా, ఎన్ శివ, ఎస్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ రక్షిత తాగునీరు



జి.కొత్తపల్లిలో చేతి పంపును రిపేర్ చేస్తున్న దృశ్యం

శంఖవరం: గ్రామంలోని ప్రజలందరికీ రక్షిత తాగునీరు అదించాలని పంచాయతీ సిబ్బందికి సర్పంచ్ ఈగల విజయదుర్గ సూచించారు. మండలంలోని జి.కొత్తపల్లిలో మరమ్మతులకు గురైన చేతి పంపులు, వాటర్ పైపులకు ఆదివారం రిపేర్లు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయదుర్గ మాట్లాడుతూ వేసవికాలం నేపథ్యంలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. డ్రైన్లలో పూడిక తీసి, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని సూచించారు.

పెద్దాపురం యువకుడికి అవార్డు

పెద్దాపురం: పట్టణానికి చెందిన ప్రముఖ దర్శకుడు అనుప్రసాద్‌కు తెలంగాణ ప్రభుత్వం అరుదైన అవార్డును అందించింది. జోరుగా హుషారుగా సినీ దర్శకుడిగా పేరొందిన ఆయనకు ఆ సినిమా నిడివి గల సినిమా విభాగంలో 'అస్థిత్వం తెలంగాణ స్టేట్ అవార్డు' ఆ ప్రభుత్వం తరపున ఆయన అందుకున్నారు. అవార్డు అందుకున్న అను ప్రసాద్‌ను పట్టణ ప్రముఖులు, మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం ప్రత్యేకంగా అభినందించింది.

కోళ్లఫారాలు ఖాళీ !

- బర్డ్‌ఫ్లూ వ్యాప్తితో ఆందోళన చెందుతున్న రైతులు
- జీవనోపాధికి తాత్కాలిక విరామం
- కోన ప్రాంతంలో 60కి పైగా కోళ్లఫారాలు



గోర్సపాలెంలో బర్డ్ ఫ్లూ కారణంగా ఖాళీగా ఉన్న కోళ్ల ఫారాలు

తొండంగి: సాగర తీరమైన కోనప్రాంతంలో కోళ్ల ఫారాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాప్తి చెందడంతో పలు ప్రాంతాల్లో కోళ్లు మృతి చెందాయి. కాగా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో కోన ప్రాంతంలో నిర్వాహకులు కోళ్లఫారాలను ఖాళీ చేశారు. ఈ ప్రాంతం హేచరీలతో పాటు కోళ్ల ఫారాలకు అనుకూలంగా ఉండటంతో గతంలో పదుల సంఖ్యలో ఫారాలను ఏర్పాటు చేశారు. కంపెనీల సహకారంతో పాటు కోళ్ల పెంపకంతో జీవనోపాధి పొందుతున్న రైతులంతా తాత్కాలికంగా ఆదాయం లేక ఖాళీగా ఉన్నారు.

అనువైన వాతావరణం

మండలంలోని అద్దరిపేట నుంచి పంపాదిపేట, వేమవరం, యర్రయ్యపేట, కొత్తపేట, అన్నయ్యపేట, ఎల్లయ్యపేట, జి.ముసలయ్యపేట, వాడ ముసలయ్యపేట, దానవాయిపేట, తాటియాకులపాలెం, ఒంటిమామిడి, కొత్తపాకలు, గోర్సపాలెం, వాకదారిపేట, పెరుమాళ్లపురం, హుకుంపేట, కొత్తపోడిపల్లిపేట, పాతపోడిపల్లిపేట తదితర తీరప్రాంత గ్రామాలున్నాయి. ఈ ప్రాంతం అంతా ఇసుక నేల కావడంతో సముద్ర తీరంలో పలు హేచరీలను ఏర్పాటు చేశారు. తీరానికి దగ్గరలో మామిడి, జీడిమామిడి, సరుగుడు తోటలను సాగు చేస్తున్నారు. ఈ ఆహ్లాదకరమైన వాతావరణం కోళ్ల పెంపకానికి ఎంతో అనుకూలంగా మారింది. దీంతో 50 నుంచి 60 వరకూ కోళ్ల ఫారాలు ఏర్పాటు చేశారు.

జీవనోపాధిగా మారిన కోళ్ల పెంపకం

మండలంలోని పలు గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులు తమ తోటల్లో కోళ్లఫారాలు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. బ్రాయిలర్, నాటు కోళ్లను బ్యాచ్‌లుగా పెంచి వాటిని మార్కెట్ ధరకు అనుగుణంగా విక్రయిస్తారు. ఒక్కో ఫారంలో 5 నుంచి పది మంది వరకూ కూలీలు కోళ్లకు మేత వేయడం, నీళ్ల పెట్టడం, షెడ్లు శుభ్రం చేయడం వంటి పనులతో జీవనోపాధి పొందుతున్నారు. ఒక్కో ఫారంలోనూ ఏడాదికి ఆరు నుంచి ఏడు బ్యాచ్‌ల వరకూ వేస్తుంటారు.

వైరస్ భయంతో..

కోళ్ల పెంపకంతో ఉపాధి పొందుతున్న రైతులకు బర్డ్‌ఫ్లూ వైరస్ తీవ్ర ఆందోళన కలిగించింది. వైరస్ కారణంగా కోళ్లు చనిపోతాయనే భయంతో ఆరోగ్యంకరంగా ఉన్న కోళ్లను రైతులు విక్రయించారు. ప్రస్తుతం కోళ్లఫారాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వైరస్ ప్రభావం పూర్తిగా తగ్గితేగాని కోళ్లను వేయలేమని, ఇప్పటికే కోళ్ల మేతల రేట్లు పెరగడంతో నష్టాలు చవిచూస్తున్నామని కోళ్ల రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధికి ప్రత్యామ్నాయ మార్గాలు



కొన్నేళ్లుగా మా గ్రామ శివారు తీరం ప్రాంతంలో కోళ్ల పెంపకం నిర్వహిస్తున్నాను. నాతో పాటు 10 నుంచి 20 మంది వరకూ కోళ్ల పెంపకం ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. బర్డ్‌ఫ్లూ కారణంగా కోళ్లను పెంచడం విరమించుకున్నాం. సాధారణ పరిస్థితులు ఏర్పడితేగాని కోళ్ల పెంపకం మళ్లీ ప్రారంభించలేము. జీవనోపాధికి ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుంటున్నాం.

– అంబుజాలపు నాగేంద్రరావు, కోళ్ల పెంపకం రైతు, గోర్సపాలెం తొండంగి మండలం

తీరప్రాంతంలో బర్డ్‌ఫ్లూ కేసులు లేవు

సముద్ర తీర ప్రాంతంలోని కోళ్ల ఫారాల్లో బర్డ్‌ఫ్లూ కేసులు నమోదు కాలేదు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ముందు జాగ్రత్తగా కొద్ది మంది రైతులు కోళ్లను పెంచడం మానేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం 100 డిగ్రీల వేడితో ఉడికించిన కోడి మాంసం తినడం వల్ల ప్రజల ఆరోగ్యానికి ఎటువంటి హానీ ఉండదు.

– బి.చైతన్య, పశువైద్యాధికారి, తొండంగి

లోవోల్టేజ్ సమస్య పరిష్కరించాలని వినతి



మల్లేపల్లిలో విద్యుత్ శాఖ ఏఈకి వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లిలో లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఏఈ కిరణ్ కిషోర్‌కు దార్లంక మాణిక్యం ఆధ్వర్యంలో ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ విద్యుత్ సమస్య రోజురోజుకూ పెరగడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రస్తుతం వేసవి నేపథ్యంలో సమస్య మరింత జఠిలమైందని వాపోయారు. 24 గంటలూ విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఏఈని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బలిరెడ్డి గంగరాజు వరలక్ష్మి, మాజీ సర్పంచ్ గ్రంధి నాగ సుబ్రమణ్యం, గ్రామస్తులు కాటేపల్లి భద్రం, దిడ్డి చిన్న శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

శుభ్రత.. ఆరోగ్య భద్రత



రేఖవానిపాలెంలో తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్‌డీ మరిడియ్య



ధర్మవరంలో తడి, పొడి చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ బాలామణి



రమణయ్యపేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ, అధికారులు

- గ్రామాల్లో చెత్త సేకరణపై ప్రత్యేక డ్రైవ్
- పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన

ఏలేశ్వరం: ఇళ్లలోని చెత్త, వ్యర్థాలతో వర్మీ కంపోస్టు ఎరువులు తయారు చేయవచ్చని ఎంపీడీఓ కేవీ సూర్యనారాయణ తెలిపారు. ఇంటింటికీ చెత్త సేకరణపై మండలంలోని తిరుమాలి, రమణయ్యపేట గ్రామాల్లో ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఎంపీడీఓ ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తలను వేరు చేయడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉదయం 6 గంటల నుంచి హరితరాయబారులు ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తలను సేకరిస్తారన్నారు. సేకరించిన చెత్తను సంపద కేంద్రానికి తరలించి వర్మీ కంపోస్టు ఎరువులను తయారు చేస్తారని తెలిపారు. ఈ ఎరువులను కూరగాయలు, పండ్లు, పూలమొక్కలు, పొలాల్లో వేయడం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

తుని రూరల్: గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు క్షేత్రస్థాయిలో తడి, పొడి చెత్త సేకరణపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఈఓపీఆర్‌డీ జి.మరిడియ్య సూచించారు. మండలంలోని అన్నిగ్రామాల్లో ఆదివారం తడి, పొడి చెత్త సేకరణ కార్యక్రమాలు నిర్వహించారు. రేఖవానిపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ మరిడియ్య పాల్గొన్నారు. గ్రామీణులకు రెండు రంగులు డస్ట్ బిన్లు పంపిణీ చేశారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా డస్ట్‌బిన్లలో ఉంచి ఇంటింటికి వచ్చే పారిశుధ్య కార్మికులకు అందజేయాలని మహిళలకు సూచించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో కార్యదర్శులు టీవీవీ సత్యనారాయణ, నాగన్నదొర, ఎం.వీరలక్ష్మి, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుతోనే వ్యాధుల నియంత్రణ

ప్రత్తిపాడు రూరల్: పారిశుధ్యం మెరుగుతోనే వ్యాధుల నియంత్రణ సాధ్యమని పెద్దాపురం డీఎల్‌పీఓ ఎం.బాలామణి అన్నారు. మండలంలోని ధర్మవరంలో తడి, పొడి చెత్త సేకరణ, చెంత నుంచి సంపద కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీపై గ్రామీణ మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. చెత్త నుంచి సంపదను సృష్టిస్తే పంచాయతీలకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. దీని కోసం ప్రతి మహిళా పారిశుధ్య కార్మికులకు సహకరించాలన్నారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా విభజించి వర్మీ కంపోస్టును తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల, అబ్బాయి, గ్రామ కార్యదర్శి కామరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలాం స్ఫూర్తితో ఉన్నతంగా ఎదగాలి

- ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ శంకరరావు



వి.కొత్తూరులో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ శంకరరావు

తుని రూరల్: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తితో విద్యార్థినులు ఉన్నతంగా ఎదగాలని ఏపీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు సూచించారు. తుని మండలం వి.కొత్తూరులోని గిరిజన ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను ఆదివారం ఆయన సందర్శించారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థినులు ఏవిధంగా చదువుతున్నారో తెలుసుకునేందుకు గాను పరిశీలనకు వచ్చినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు లక్ష్యం, పట్టుదల, కృషి, అంకితభావంతో చదువుకోవాలన్నారు. ఒత్తిడిని జయించి ఏకాగ్రత, దూర దృష్టి, మనోధైర్యంతో విజయం వైపు ముందడుగు వేయాలన్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆశ్రమ పాఠశాలలో సమస్యలపై విద్యార్థినులను ఆరా తీశారు. అనంతరం వంటశాల, ఆశ్రమ పాఠశాల భవనాలను ఆయన పరిశీలించారు.

ఛైర్మన్ దృష్టికి సమస్యలు

గిరిజన ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావుకు ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి వివరించారు. పాఠశాల చుట్టూ 20 ఏళ్ల క్రితం నిర్మించిన ప్రహరీ శిథిలమయ్యిందన్నారు. వర్షం వస్తే పాఠశాల ఆవరణలో నీరు నిల్వ ఉండిపోతుందని, కాలువలు లేకపోవడం, తాగునీటి వసతులు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. సమస్యలను స్థానిక ఎమ్మెల్యే యనమల దివ్యకు తెలియజేయగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు ఆమె వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ముద్రగడ నాయకత్వంలో పార్టీ బలోపేతం



ముద్రగడ పద్మనాభాన్ని, గిరిబాబును కలసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని గంగవరం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అన్నారు. కిర్లంపూడిలోని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం నివాసానికి రౌతులపూడి మండలం గంగవరం గ్రామ పంచాయతీకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం భారీగా తరలివచ్చారు. ముద్రగడ పద్మనాభం, గిరిబాబులను మార్యాదపూర్వకంగా కలిశారు. ముద్రగడ పద్మనాభంతో తమ గ్రామానికి ఉన్న రాజకీయ అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సైపురెడ్డి వెంకట రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు బొలిశెట్టి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ రాజుబాబు, ఉపసర్పంచ్ మంతిన పాపారావు, సుర్ల రాజుబాబు, పాశాల రాజుబాబు, ఎస్.రామకృష్ణ, సిరిమిశెట్టి రామకృష్ణ, లంక నాగబాబు, పైడిపాల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో బైక్ ర్యాలీ



అద్దరిపేట బీచ్‌రోడ్డులో బైకులపై ర్యాలీ చేస్తున్న యువత

తొండంగి: ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని మండలంలోని అద్దరిపేట బీచ్ రోడ్డులో ఆదివారం యువత బైక్ ర్యాలీ నిర్వహించారు. యువత శివాజీ జెండాలు పట్టుకుని బైకులపై అద్దరిపేట నుంచి వేమవరం, యర్రయ్యపేట, ఎల్లయ్యపేట, జీఎం.పేట, దానవాయిపేట, ఒంటిమామిడి, కొత్తపాకలు, వాకదారిపేట గ్రామాల మీదుగా బీచ్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. తీర గ్రామాల యువకులు ర్యాలీలో పాల్గొన్నారు.

ఖాళీ చేయించి..కష్టాలు మిగిల్చి..

- రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఇళ్లు, షాపుల తొలగింపు
- ఉపాధితో పాటు సర్వం కోల్పోయిన ప్రజలు
- అధికారులు కఠినంగా వ్యవహరించారని ఆవేదన



కిళ్లీ షాపు కూల్చేయడంతో శిథిలాలను తొలగించుకుంటున్న బాధితులు



షాపు కూల్చేసిన చోట ఖాళీ షోడా సీసాలు తీస్తున్న నిర్వాహకుడు

గండేపల్లి: సామర్లకోట నుంచి రాజానగరం వరకూ గల ఏడీబీ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా మండలంలోని రామేశంపేటలో పనులు ప్రారంభించేందుకు గాను స్థానికుల పట్ల అధికారులు వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు తమ పట్ల కఠినంగా వ్యవహరించారని స్థానికులు చెబుతున్నారు. ఎటువంటి నోటీసులు ఇళ్లు, దుఖాణాలు ఖాళీ చేయించారని, నష్టానికి తగ్గ పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత మార్కెట్ విలువకు తగ్గ నష్ట పరిహారం ఇవ్వాలని రెవెన్యూ అధికారుల చుట్టూ పలు మార్లు తిరిగినప్పటికీ ఫలితం దక్కలేదని బాధితులు వాపోతున్నారు. గురువారం ఉదయం పోలీస్ యంత్రాంగంతో వచ్చిన రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు పొక్లెయిన్లతో ఉన్నపలంగా నిర్మాణాలు కూలగొట్టారన్నారు. ఒక్క గంట అవకాశం ఇస్తే సామాన్లు మొత్తం తీసెస్తామని కాళ్లావేళ్లా పడ్డా కనికరించలేదన్నారు. సామగ్రి తీసుకునేందుకు లోపలికి వెళితే బయటకు లాక్కుకొచ్చేశారని నివాసితులు, షాపుల యజమానులు వాపోయారు. నిర్మాణాలు కూలగొట్టడంతో టీవీలు, ఫ్రిజ్‌లు, విలువైన సామగ్రి, గృహోపకరణాలు శిథిలాల కింద ఉండిపోయాయని ఆవేదన చెందారు. అధికార యంత్రాంగం ఏకపక్షంగా వ్యవహరించడపై స్థానికులు మండిపడుతున్నారు. దీనిపై గండేపల్లి తహసీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా కొన్ని రోజుల ముందు అక్కడి వారికి ఖాళీ చేయాలని స్వయంగా వెళ్లి చెప్పామన్నారు. దీనిపై ఎటువంటి నోటీసులు ఇవ్వలేదన్నారు.

బయటకు లాగేశారు



ఇంటిలో సామాన్లు తీసుకుంటాం. ఒక్క గంట టైం ఇవ్వండి. మీ కాళ్లు పట్టుకుంటామని తహసీల్దార్‌ను అడిగినా కనికరించలేదు. చాలా సామాన్లు లోపల ఉండిపోయాయి సారూ.. తీసుకుంటాను అని లోపలకి వెళ్లాను. బయటకు వస్తావా..రావా..అంటూ బయటకు లాగేశారు.

మొల్లు అప్పారావు, పాన్ షాపు నిర్వాహకుడు, రామేశంపేట

షాపు వరకే అని చెప్పి ఇళ్లు కూల్చారు



ముందు షాపు వరకే అని చెప్పారు. తర్వాత ఇంటిని కూల్చేశారు. నష్ట పరిహారం తక్కువగా ఇస్తున్నారు అని అధికారులను అడిగితే తర్వాత మాట్లాడదాం అన్నారు. ఖాళీ చేయమని నోటి మాటే చెప్పారు గాని ముందస్తుగా ఎటువంటి నోటీసులు ఇవ్వలేదు. చాలా నష్టపోయాం.

గుబ్బల సాయిసురేష్, బాధితుడు, రామేశంపేట

సర్వం కోల్పోయాం



మాకు రెండు పాన్ షాపులు ఉండేవి. రోడ్డు విస్తీరణలో షాపులతో పాటు ఇల్లు పోయింది. ఉపాధితో పాటు సర్వస్వం కోల్పోయాం. మూడు కుటుంబాల వారం రోడ్డున పడ్డాం. టైమ్ ఇవ్వకపోవడంతో సామాన్లు నష్టపోయాం. అధికారులు దారుణంగా వ్యవహరించారు.

టి.వెంకట రమణ, కిళ్లిషాపు, రామేశంపేట

అధికారులు కనికరించలేదు



అధికారులు కనీస సమయం ఇవ్వలేదు. సామాన్లు పట్టుకుపోతాం కొంచెం టైం ఇవ్వండి అని ప్రాధేయపడినా కనికరించలేదు. నా కుటుంబంతో పాటు మా అన్నదమ్ముల కుటుంబాలు ఇక్కడే నివాసం ఉంటున్నాయి.

టి.నాగ గణేష్, రామేశంపేట

జోరుగా అపరాల పంట ఒబ్బిడి



పి.ఇ.చిన్నాయపాలెంలో అపరాల పంటను ట్రాక్టర్‌తో నూర్చుతున్న రైతు

తొండంగి: మండల పరిధిలోని గ్రామాల్లో అపరాల పంట ఒబ్బిడి పనులు జోరుగా సాగుతున్నాయి. పంపా రిజర్వాయర్ గేట్లు, స్లూయిజ్ మరమ్మతుల కారణంగా ఈ ఏడాది పంపా ఆయకట్టు పరిధిలో రబీ వరిసాగుకు నీటి విడుదల లేకపోవడంతో రైతులు మినుము, పెసర పంటలను సాగు చేశారు. పి.ఈ.చిన్నాయపాలెం, రావికంపాడు, కొమ్మనాపల్లి, బెండపూడి, సీతారాంపురం తదితర గ్రామాల్లో దాదాపు రెండు వేల ఎకరాలకు పైగా అపరాలు సాగు చేశారు. ఈ పంటలన్నీ పక్వానికి రావడంతో కూలీలతో ఒబ్బిడి చేయిస్తున్నారు. ఆరుదలగా ఎండిన పంటను ట్రాక్టర్లతో నూర్పిడి చేయిస్తున్నారు. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండటంతో నూర్పిడి పనులు జోరుగా సాగుతున్నాయి.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఆదివారం జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్–2 పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగిన పేపర్–1 పరీక్షలకు మొత్తం 6460 మంది హాజరు కావాల్సి ఉండగా 795 మంది గైర్హాజరైనట్టు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయింత్రం 5.30 గంటల వరకూ జరిగిన పరీక్షలకు గాను 6460 మందికి 796 మంది గైర్హాజరైనట్టు వివరించారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు, సిబ్బంది పోలీస్ బందోబస్తు నిర్వహించారు.